కాంట్రాక్ట్ ప్రొఫెసర్ పోస్టులకు 528 దరఖాస్తులు

హైదరాబాద్ సిటీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అనుబంధ కాలేజీల్లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు రాష్ట్రవ్యాప్తంగా 528మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పాలేరు, మహబూబాబాద్, సుల్తాన్‌పూర్, మంథని, జగిత్యాలలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఇంజనీరింగ్ కాలేజీల్లో కొన్నేళ్లుగా బోధనా సిబ్బంది కొరత ఏర్పడింది. ఆయా ఖాళీలను భర్తీచేసేందుకు గత నెల 23న జేఎన్‌టీయూ నోటిఫికేషన్ ఇవ్వగా, సోమవారంతో గడువు ముగిసింది. కళాశాలల వారీగా మహబూబాబాద్‌కు 208, పాలేరుకు 198, సుల్తాన్‌పూర్‌కు 64, మంథనికి 35, జగిత్యాలకు 23 దరఖాస్తులు అందినట్లు తెలిసింది. అభ్యర్థులకు ఈ నెల 3న రాతపరీక్ష నిర్వహిస్తామని పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణమోహనరావు, 6వ తేదీలోగా నియామక ప్రక్రియను పూర్తిచేస్తామని అకడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ కామాక్షి ప్రసాద్ తెలిపారు.

జర్మనీ వర్సిటీలతో జేఎన్టీయూహెచ్ విద్యా బంధం..

సిలబస్ ఖరారుకు వెళ్లిన ప్రతినిధి బృందం

- 3 రోజుల జర్మనీ పర్యటనను ముగించుకున్న ఉన్నతాధికారుల బృందం
- క్యాసెల్, రాయిట్‌లింగెన్, ఆచెన్ విశ్వవిద్యాలయాల సందర్శన
- కొత్త కోర్సుల నిర్మాణం, సిలబస్ ఖరారుపై కీలక చర్చలు
- అంతర్జాతీయ పరిశోధనలు, అత్యాధునిక ల్యాబ్‌ల పరిశీలన

భూమి శ్రీనివాస్ రెడ్డి, నవభూమి ప్రతినిధి, హుకట్‌పల్లి, జూలై 1 : జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ అంతర్జాతీయ స్థాయిలో తన అకడమిక్, పరిశోధన సహకారాన్ని మరింత విస్తరిస్తోంది. వజ్రోత్సవ వేడుకలు, గ్లోబల్ అలుమ్ని మీట్ వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలతో గ్లోబల్ క్యాంపస్‌గా అవతరించి విదేశీ వర్సిటీలతో విద్యా బంధాన్ని బలోపేతం చేసుకుంటోంది. ఇందులో భాగంగా జేఎన్టీయూహెచ్‌కు చెందిన ముగ్గురు సభ్యుల ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం జూన్ నెలలో జర్మనీలో మూడు రోజుల పాటు విజయవంతంగా పర్యటించి తిరిగి వచ్చింది.

సిలబస్ ఖరారే ప్రధాన అజెండా..

ఈ ప్రతినిధి బృందంలో జేఎన్టీయూహెచ్ అకడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ డాక్టర్ వి. కామాక్షి ప్రసాద్, ఎం.ఎస్.సి. రెహ్మానుల్ ఎనర్జీ అండ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్ అండ్ అప్లికేషన్ కోర్సు కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం.టి. నాయక్, బిబిఎంఏ కోర్సుల కో ఆర్డినేటర్ డాక్టర్ ఓ.వి.వి. రమణయ్య ఉన్నారు. జేఎన్టీయూహెచ్ సహకారంతో జర్మన్ వర్సిటీలు నిర్వహిస్తున్న జాయింట్ కోర్సుల నిర్మాణాన్ని, వివరణాత్మక సిలబస్‌ను ఖరారు చేయడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం.

తొలి రెండు రోజులు క్యాసెల్, రాయిట్‌లింగెన్‌లో.. పర్యటనలో మొదటి రెండు రోజుల పాటు ప్రతినిధి బృందం రాయిట్‌లింగెన్ యూనివర్సిటీలోని నాలెడ్జ్ ఫౌండేషన్, క్యాసెల్ యూనివర్సిటీలను సందర్శించింది. ఆయా విశ్వవిద్యాలయాల్లో అందుబాటులో ఉన్న అత్యాధునిక ప్రయోగశాలలు, మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించింది. అక్కడి అధ్యాపకులు, విద్యార్థులతో సమావేశమై కోర్సుల అమలు, బోధనా పద్ధతులు, సాంకేతిక మార్పిడిపై బృంద సభ్యులు విస్తృతంగా చర్చలు జరిపారు. పర్యటనలో మూడవ రోజున జర్మనీలోని ఆచెన్ నగరంలో ఉన్న ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను బృందం సందర్శించింది. ప్రస్తుతం క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో 104వ స్థానంలో ఉన్న పబ్లిక్ వండెడ్ యూనివర్సిటీ అర్‌డబ్ల్యూటీహెచ్ ఆచెన, అలాగే ఎఫ్‌హెచ్ ఆచెన్ యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ ప్రాంగణాలను ప్రతినిధులు పరిశీలించారు. ఈ రెండు వర్సిటీలతో భవిష్యత్తులో విద్యా, పరిశోధనపరంగా ఎలాంటి భాగస్వామ్యాలు నెలకొల్పాలనే అవకాశాలపై వారు లోతుగా అధ్యయనం చేశారు.